క్లుప్తంగా

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ అశోక్

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలో సోమవారం ఆయిల్ పామ్ మేనేజర్ అశోక్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల వచ్చే లాభాలు, ప్రభుత్వం నుంచి సబ్సిడీలు తదితర వాటిని గురించి వివరించారు. రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు తమవంతుగా అవగాహన కల్పించి, వారిలో సాగు చేసేలా ప్రోత్సస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ, జైన్ అగ్రోనమిస్ట్ శ్రీ సంజీవతో పాటు రైతులు పాల్గొన్నారు.

బేటీ బచావో- బేటీ పడావో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట, వెంకటాపూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు మహేశ్వరీ, సద్గున, లక్ష్మి, మహిళలు, పిల్లలతో కలిసి శనివారం బేటీ బచావో – బేటీ పడావో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆడపిల్లలను రక్షించడంతో పాటు చదివించాలని తెలిపారు. ఆడపిల్లలతోనే ఇంటికి వెలుగని అన్నారు. వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పోషకాహారం అందించడంతో పాటు ఆట పాటలతో విద్యబోధన చేసి వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడం జరుగుతుందన్నారు. గ్రామస్తులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అపరిశుభ్రంగా మంచినీటి ట్యాంకు



ట్యాంకు వద్ద మురుగునీరు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని శాలిపేట గ్రామానికి సరఫరా చేసే మంచినీటి ట్యాంకు వద్ద నీరు నిండి అపరిశుభ్రంగా మారింది. గ్రామానికి తాగు నీటిని సరఫరా అయ్యే ఏదైనా పైప్ లీకేజీ అయి మురుగునీరు సరఫరా అయి ఆ నీటిని సేవిస్తే అనారోగ్యాల బారినపడే అవకాశం ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి, మంచినీటి ట్యాంకు ఆవరణలో పరిశుభ్రం చేసి రోగాలు ప్రబలకుండా చూడాలని కోరుతున్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ

రామాయంపేట(మెదక్): పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. 14 నుంచి ఈనెల 20 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు అగ్ని మాపక కేంద్రం సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సీఐ వెంకట్‌రాజాగౌడ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాండ్ మార్క్‌గా బసవేశ్వర చౌక్

నారాయణఖేడ్: పట్టణంలోని బసవేశ్వరచౌక్‌ను ల్యాండ్ మార్క్‌గా తీర్చిదిద్దాలని మున్సిపల్ మాజీ చైర్మన్, లింగాయత్ సమాజ తాలూకా అధ్యక్షుడు ఆనంద్ స్వరూప్ షెట్కార్ తెలిపారు. ఆదివారం లింగాయత్ సమాజ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బసవేశ్వర చౌక్‌లో భారీ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అన్నారు. తాలూకా పరిధిలోని లింగాయత్‌లు సహకరించాలని కోరారు. ఈనెల 30న బసవ జయంతి ఉన్నందున భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శెట్టి శంకర్, నాగశెట్టి, వీరన్న, శివకుమార్, జగదీష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా సోమవారం అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్‌లో పిల్లల పార్కులోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్ అందరి వాడని అన్నారు.

అంబేడ్కర్ అందరి వాడు

చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పూలమాలలువేసి నివాళులర్పించారు. పెద్దశంకరంపేటలోని తిరుమలాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి ఆవిష్కరించారు. ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.



నర్సాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



పెద్దశంకరంపేటలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



చిన్నశంకరంపేట(మెదక్): మిర్జాపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



నర్సాపూర్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



తూప్రాన్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో వంటేరు ప్రతాప్‌రెడ్డి



చేగుంట(తూప్రాన్): పోతాన్‌పల్లిలో..



రామాయంపేటలో..



నర్సాపూర్ రూరల్: అచ్చంపేటలో..



వెల్దుర్తి(తూప్రాన్): బైక్ ర్యాలీ

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



చేగుంట(తూప్రాన్): మక్కరాజీపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు



చిన్నశంకరంపేట(మెదక్): శాలిపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేటలో సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్ సహకార సంఘం వైస్ చైర్మన్ తానీషా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, దళారులకు ధాన్యం విక్రయించొద్దని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘువీర్, రమేశ్‌గౌడ్, విశ్వేశ్వర్‌రావు, శ్రీశైలం గ్రామ రైతులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని మడూర్ సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని మడూర్, గజగట్లపల్లి, శాలిపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ కృష్ణా, డైరెక్టర్ శ్రీశైలం పాల్గొన్నారు. జంగరాయి సహకార సంఘం ఆధ్వర్యంలో జంగరాయి, చందాపూర్, అంబాజీపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జంగరాయి పీఏసీఎస్ చైర్మన్ ఎస్. శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. సీఈఓ బాలకిష్టయ్య పాల్గొన్నారు. కామారంలో పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు మహమ్మద్‌నగర్ సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ సీఈఓ దుర్గాగౌడ్, ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్ తెలిపారు.

భూభారతితో సమస్యలు పరిష్కారం

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం ప్రారంభించిన భూభారతి పోర్టల్ ద్వారా రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధు అన్నారు. సోమవారం మండల పరిధిలోని శివాయిపల్లి రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన భూభారతి పోర్టల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాగౌడ్, అంజిరెడ్డి, పెరుమాండ్లగౌడ్, సుభాష్, వెంకట్‌గౌడ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి పోచయ్య, మల్లేశం, వెంకటేశం, ఏఈఓలు అఖిల్‌హుస్సేన్, వినీత్ పాల్గొన్నారు.



భూభారతి పోర్టల్‌ను వీక్షిస్తున్న రైతులు

ఘనంగా శనైశ్చరాలయ శిఖర ప్రతిష్ఠ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శనైశ్చరాలయంలో శిఖర ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ, మురళీధరశర్మ పూజలు నిర్వహించి శనేశ్వరాలయం శిఖర ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి దేవతామూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, మాజీ సర్పంచ్ రాజేందర్, నాయకులు పోల నవీన్, శ్యాంసుందర్‌రావు, సందీప్, భక్తులు పాల్గొన్నారు.



వెల్మకన్నలో శనైశ్చరాలయంలో శిఖర ప్రతిష్ఠలో పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతీ స్వామి

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టండి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీ పేరుతో చేస్తున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభకు పెద్దసంఖ్యలో తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సోమ వారం మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. బహిరంగ సభ దిగ్విజయానికి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నగేష్, మల్గొండ, వెంకటేశం, సాలమన్, నవాబ్, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్ రెడ్డి

సైబర్ నేరాలపై అవగాహన

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామంలో సోమవారం గ్రామస్తులకు ఎస్ఐ రాజేశ్ సైబర్ నేరాలు, బెట్టింగ్ యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెట్టింగ్ యాప్‌ల గురించి, ఫోన్ల ద్వారా డబ్బులు మోసం చేసి, తీసుకునే నేరాల గురించి వివరించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. రైతులు రోడ్డుపై ధాన్యం ఆరబోయరాదని, అన్నం పెట్టే రైతులు అజాగ్రత్తతో రోడ్లపై ధాన్యం కుప్పలు పోయడం వల్ల ప్రమాదాలు జరిగి మరణించిన వారి కుటుంబాలు వీధి పాలవుతున్నాయన్నారు. ఈ విషయమై జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డుపై ధాన్యాన్ని ఆరబోయవద్దని రైతులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆరోగ్య శిబిరం



ప్రచారం చేస్తున్న సంస్థ సభ్యులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెదక్ శాఖ, వీఎస్టీ పరిశ్రమ తూప్రాన్ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ డా. రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద బీపీ, షుగర్ పరీక్షలు, కంటి, చెవి ముక్కు, గొంతు, వరిబీజం, బీజకుట్టు గడ్డలు, కనదులు, థైరాయిడ్ గడ్డలు, గర్భసంచికి సంబంధించిన సమస్యలు, అలాగే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యల సమస్యలపై మల్లారెడ్డి ఆస్పత్రి వైద్యులచే చికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చికిత్సల అనంతరం ఉచిత మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రచారంలో రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు దామోదర్‌రావు, వైద్య ప్రతినిధి హరికృష్ణ, ఐఆర్‌సీ సభ్యుడు తిరుపతి ఉన్నారు.

పెద్దమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

నర్సాపూర్ రూరల్: మండలంలోని కొండాపూర్‌లో వెలసిన పెద్దమ్మ ఉత్సవాల కోసం నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 16, 17 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక మౌలిక వసతులు కల్పిస్తున్నారు. 16వ తేదీ బుధవారం ఉదయం గణపతి పూజ, పెద్దమ్మకు అభిషేకం, అలంకరణ ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12:30 గంటలకు పెద్దమ్మ దేవి, పెద్దిరాజుల కల్యాణోత్సవం, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, గురువారం బోనాల ఊరేగింపు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చే భక్తులు సమన్వయం పాటించి, సహకరించాలని కోరారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్



చిలప్‌చెడ్‌లో రైతునేస్తం వీక్షిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రొ. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు అందించే ముఖ్యమైన సలహాలు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన చిలప్‌చెడ్ రైతువేదికలో జరిగిన వీడియో కన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు వెల్లడించిన చిరుధాన్యాల సాగు, వేసవిలో కూరగాయాల సాగు, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి గురించి తెలియజేశారు. అదేవిధంగా పంట వ్యర్థాలు కాల్చడం వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. రైతులు ఒకే పద్ధతిలో వ్యవసాయం చేయకుండా శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక దిగుబడి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు కృష్ణవేణి, దివ్యశ్రీ, మాజీ వైస్ ఎంపీపీ విశ్వంభర, చిట్కుల్ మాజీ ఎంపీటీసీ సుభాష్‌రెడ్డి, అజ్జమర్రి మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బేతాళస్వామి జాతర ప్రారంభం



అల్లాదుర్గంలో పోలేరమ్మ రథోత్సవం



బోనాల ఊరేగింపు

అల్లాదుర్గం(మెదక్): బేతాళస్వామి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పోలేరమ్మకు మహిళలు బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. చిన్నారులు, పెద్దలు రథాన్ని రంగు రంగుల లైట్లతో అలంకరించి గ్రామ వీధులగుండా ఊరేగించి, పోలేరమ్మ ఆలయం చూట్టూ ప్రదక్షిణలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా మంగళవారం పోచమ్మకు బోనాల ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



శివ్వంపేట(నర్సాపూర్): గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ ఆత్మీయ సమ్మేళనం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా దొంతిలోని జీవన్ దివ్య ఫంక్షన్‌హాల్‌లో అందరూ కలుసుకొని అప్పటి గురువులను సన్మానించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడంతో పాటు యోగక్షేమాల గురించి చర్చించుకున్నారు.

పంట రక్షణకు ట్యాంకర్ నీరే దిక్కు

సాగు చేస్తున్న వరి పంటకు సరిపోను నీరందక ఎండుతుండటంతో పంట సంరక్షణకు రైతులు ట్యాంకర్‌తో నీరును అందిస్తున్నారు. మనోహరాబాద్ మండలం పర్కిబండ గ్రామ పంచాయతీ పరిధిలోని తుపాకులపల్లి గ్రామానికి చెందిన యువ రైతు బొల్ల బోయిన నరేందర్, వారి కుటుంబీకులు ఉన్న రెండెకరాల్లో వరిపంట వేశారు. వేసవి కాలం కావడంతో బోరు నీరు అందక ట్యాంకర్లను కొనుగోలు చేసి, నీరందిస్తున్నట్లు తెలిపారు.

– మనోహరాబాద్(తూప్రాన్)



తుపాకులపల్లిలో వరిపంటకు ట్యాంకర్‌తో నీరందిస్తున్న రైతు

తెలంగాణకు కేసీఆరే శ్రీరామ రక్ష

దుబ్బాక: తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. 27న జరిగే బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ బహిరంగసభ వాల్ పోస్టర్లను క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. వరంగల్‌లో జరిగే ఈ సభకు నియోజకవర్గం నుంచి 15 వేలకు పైగా ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.